సాక్షి ప్రకాశం

శుక్రవారం । 13 । జూన్ । 2025



వేలం బహిష్కరణ.. రోడ్డెక్కి నిరసన

గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ కనిగిరిలో పొగాకు రైతులు వేలాన్ని బహిష్కరించి రోడ్డెక్కి ఆందోళనకు దిగారు.

- 8లో..



టీడీపీ నిరసనకు అనుమతి లేదట.. వైఎస్సార్ సీపీ వారిదే తప్పట!

రాళ్లు, చెప్పులతో దాడి చేసిన టీడీపీ వారిని వదిలేసి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై 18 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 35 /28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. ఒకటి రెండు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధి పనులు తనిఖీ చేసిన కేంద్ర బృందం



రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం అధికారులు

బేస్తవారిపేట: మండలంలోని బసినేపల్లె, గలిజేరుగుళ్ల గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులను జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధులు ఉమేష్‌కుమార్‌రామ్, జీఎస్ రావత్ బృందం గురువారం క్షేత్ర పర్యటన చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన ఉద్యానవన పంటలు, ఫారంపాండ్స్, పశువుల షెడ్లు, ట్రెంచ్‌లు, కమ్యూనిటీ పాండ్స్, నీటితొట్లు, హౌసింగ్ పథకంలో నిర్మించిన గృహాలను పరిశీలించారు. రోజువారి కూలి ఎంత పడుతుంది, ప్రతిరోజు పని పెడుతున్నారా అనే వివరాలను కూలీలతో మాట్లాడి తెలుసుకున్నారు. హౌసింగ్ పథకంలో బిల్లులు వచ్చాయా, లేదా అనే వివరాలను లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ షణ్ముఖ్, డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్, ఏపీడీ భాస్కరరావు, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఏపీఓ గురువరకుమార్, ఈసీలు పాల్గొన్నారు.

గర్భిణులు ఆర్ఎంపీలను సంప్రదించొద్దు

- డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: గర్భిణులు ఆర్ఎంపీలు, నాటు వైద్యులను సంప్రదించవద్దని, అర్హులైన వైద్యులనే సంప్రదించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. డీఎంహెచ్ఓ చాంబర్‌లో గురువారం పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు గర్భిణుల కోసం స్కానింగ్ పరీక్షలు రాయడం చట్టపరంగా శిక్షార్హం అవుతుందన్నారు. ఎవరైనా ఆర్ఎంపీలు, నాటు వైద్యులు గర్భిణులకు వైద్యం చేసినా, స్కానింగ్ రెఫర్ చేసినా వారి వివరాలను వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి రాత పూర్వకంగా గానీ, స్వయంగా గానీ ఫిర్యాదు చేయాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా వైద్యశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో స్కానింగ్‌లు ఉచితంగా చేస్తారన్నారు. గడువు తేదీలు ముగిసి ఉన్న స్కానింగ్ సెంటర్లు వెంటనే రెన్యూవల్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం స్కానింగ్ సెంటర్లు ఎలాంటి వాణిజ్య ప్రకటనలు చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షల గురించి వాణిజ్య ప్రకటనలు ఇస్తే చట్టం ప్రకారం తగిన కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ సూరిబాబు, సర్వజన ఆసుపత్రి ప్రసూతి విభాగం అధిపతి సంధ్యారాణి, సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల విభాగాధిపతి తిరుపతి రెడ్డి, ఐఅండ్‌పీఆర్ ప్రతినిధి వేణుగోపాల్, ఎన్జీఓ లక్ష్మి, పద్మజ, సౌజన్య, వాణిశ్రీ, శ్రీవాణి, శ్రవణ్ కుమార్, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాడు మెరుగుబడి.. నేడు తిరగబడి

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలతో పాటు..విద్యార్థులకు సమస్యలూ పునఃప్రారంభమయ్యాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని వసతులూ కల్పిస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసింది. బడి గంట మోగిన వేళ..ఎంతో ఉత్సాహంగా స్కూళ్లలో అడుగుపెట్టిన విద్యార్థులకు వసతుల లేమి.. నాడు–నేడు పనులు నిలిచిపోయి అసంపూర్తిగా ఉన్న భవనాలు.. పనిచేయని ఆర్వో ప్లాంట్లు.. అపరిశుభ్రంగా ఉన్న పాఠశాల ఆవరణలు ఇలా పలు సమస్యలు స్వాగతం పలికాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులే ప్రాంగణాలను శుభ్రం చేసుకోవడం కనిపించింది. విద్యార్థుల అగచాట్లపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- అవస్థల నడుమ పాఠశాలలు పునః ప్రారంభం
- విద్యార్థులకు స్వాగతం పలికిన సమస్యలు
- నాడు–నేడు ఫేజ్2లో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు
- జిల్లా వ్యాప్తంగా పనిచేయని ఆర్వో ప్లాంట్లు
- విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని యూనిఫాం, బ్యాగులు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- తొలిరోజు స్కూళ్లకు వచ్చిన విద్యార్థులకు అవస్థలు



పామూరు మండలం మోపాడులో ఫ్లోరింగ్ పూర్తి కాని గదిలో బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ:

జిల్లాలోని వివిధ యాజమాన్యాలు కింద 2,991 పాఠశాలలు ఉన్నాయి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 1,80,394 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు 15,04,680 పుస్తకాలు, బ్యాగులు 1,39,293, పాఠ్యపుస్తకాలు 12,69,884, నిఘంటువులు 65,293, బెల్టులు 52,575, ఏకరూప దుస్తులు 3,62,824 రావాల్సి ఉంది. ఈ విద్యార్థులందరికీ పాఠశాలల పునఃప్రారంభానికి నాటికి స్టూడెంట్ కిట్స్ (విద్యామిత్ర కిట్లు) స్కూల్స్ కు చేరుస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది.. కానీ ఆమేరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైంది. జిల్లాలోని చాలా పాఠశాలలకు యూనిఫాం, బ్యాగులు, షూ చేరనేలేదు. దీంతో పాఠశాల ప్రారంభమైన రోజునే కిట్లు కాకుండా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, డిక్షనరీలు మాత్రమే సరఫరా చేసి మమ అనిపించారు. పూర్తి స్థాయిలో పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం సరఫరా చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేసవి సెలవుల్లోనే పాఠ్యపుస్తకాలు, జగనన్న కిట్లు, తదితర విద్యాసామగ్రి పాఠశాలలకు చేరేవని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తు చేసుకున్నారు.

పూర్తికానీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ..

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను పూర్తి చేసి పాఠశాలల ప్రారంభం నాటికి కొత్త స్కూళ్లలో ఉపాధ్యాయులు చేరేలా చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు బదిలీలు పూర్తయినా ఎస్జీటీల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు కొత్త స్కూళ్లకి వెళ్లాలి. అయితే వారి పాత స్థానంలోకి ఎవరూ రాకపోతే అలాంటి వారు వెనక్కు రావాలి. ఈ స్థానంలోకి మరొకరు వచ్చే దాకా అక్కడే కొనసాగాలి. గురువారం కూడా బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

పనిచేయని ఆర్వో ప్లాంట్లు...

విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చాలా పాఠశాలల్లో అవి పనిచేడం మానివేశాయి. దీంతో చాలా ప్రాంతాల్లో విద్యార్థులు నీటి కోసం అగచాట్లు పడ్డారు. ఇళ్ల నుంచే బాటిళ్లలో నీళ్లు తెచ్చుకునే వారు. స్కూళ్లు తెరిచే నాటికైనా అవి బాగుపడతాయేమోనని విద్యార్థులు ఆశపడ్డారు. అయితే జిల్లాలోని పలు స్కూళ్లలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లు దర్శనమివ్వడంతో నిరాశకు గురయ్యారు. పాఠశాలల ఆవరణలో నిర్మాణ సామగ్రి నిల్వతో విద్యార్థులు అవస్థలు పడ్డారు.

మధ్యాహ్న భోజనం ఇలా..

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 2327 స్కూళ్లకుగాను 1,35,444 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారు. అందులో తొలి రోజు 89087 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 87,601 మంది విద్యార్థులను భోజనం పెట్టారు.

చీకట్లో చదువులు

కనిగిరిలో విద్యార్థిమిత్ర పూర్తిస్థాయిలో సరఫరా చేయలేదు. కొన్ని పాఠశాలలకు యూనిఫాం చేరలేదు. నియోజకవర్గంలోని ఏ పాఠశాలలకు కూడా స్కూల్ బ్యాగ్‌లు ఇవ్వలేదు. దీంతో విద్యార్థులకు ఇచ్చిన కొత్త పుస్తకాలను తీసుకువెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. గతంలో ఏర్పాటు చేసిన వాటర్ ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయకపోవడంతో అవి మూలనపడ్డాయి. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడ్డారు. బదిలీల ప్రక్రియ నేపథ్యంలో ఉపాధ్యాయులూ పూర్తిస్థాయిలో పాఠశాలల్లో కన్పించలేదు. నాడు–నేడు పనుల్లో పురోగతి లేకపోవడంతో మొండి గోడలు, పూర్తి కాని భవనాలు దర్శనమిచ్చాయి. పామూరు మండలంలోని 3 పాఠశాలలు ప్రాథమికోన్నత స్థాయి నుంచి ఉన్నత స్థాయికి అప్‌గ్రేడ్‌కాగా ఆయా పాఠశాలలో తగినన్ని గదులు, ఇతర వసతులు లేవు. దీంతో విద్యార్థులు ఫ్లోరింగ్ కాని గదిలోనే కూర్చోవాల్సి రావడంతో ఇబ్బంది పడ్డారు.



టంగుటూరు ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదిలో శుభ్రం చేస్తూ..



మార్కాపురం జెడ్పీ హైస్కూలులో నిలిచిన నీరు

వసతులు కరువు

కురిచేడు మండలానికి కొత్తగా మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మంజూరయ్యాయి. కానీ కనీస మౌలిక వసతులు కల్పించకుండానే పాఠశాలలు ప్రారంభించింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేయడమే కానీ ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నాడు–నేడు కింద మంజూరైన అదనపు గదుల నిర్మాణాలు నిలిచిపోవడంతో అన్నీ పాఠశాలల్లో తరగతి గదుల సమస్య వేధిస్తోంది. పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించకపోవడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి మంచినీరు తెచ్చుకోవాల్సి వచ్చింది.



బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్లో పనిచేయని వాటర్‌ప్లాంట్

రక్షిత నీరుకు దిక్కేది...?

గిద్దలూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో మినరల్ వాటర్‌ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. బేస్తవారిపేటలోని జెడ్పీ బాలికల హైస్కూల్, కంభంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌లు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా స్పందన లేదు. బేస్తవారిపేట మండలంలో నాడు–నేడు రెండో విడత కింద 20 పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రాచర్ల మండలంలోని ఆకవీడు యూపీ పాఠశాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, బూట్లు, యూనిఫాం, బెల్ట్ తదితర సామగ్రితో కూడిన విద్యామిత్ర కిట్లు పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు సరిపడా సరఫరా చేయలేదు. డైస్ రోల్ ప్రకారం పంపిణీ చేయడంతో కొత్తగా చేరిన విద్యార్థులకు కిట్లు అందలేదు.

చాలీ చాలని గదులు



శానంపూడి ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం

కొండపి నియోజకవర్గంలోని పాఠశాలలకు పూర్తిస్థాయిలో విద్యా మిత్ర కిట్‌లు రాలేదు. పాఠశాలల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు మూతపడ్డాయి. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడ్డారు. నూతన విధానంలో ప్రాథమిక పాఠశాలలకు టీచర్ల సంఖ్య పెంచినా చాలాచోట్ల చాలినన్నీ గదులు లేవు. శానంపూడి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ పాఠశాలలో నూతన విద్యా విధానం ప్రకారం ఒకటి నుంచి 10 తరగతులు నిర్వహిస్తారు. మొత్తం 10 గదులు కావాల్సి ఉండగా 7 గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పేలా లేవు. పాతసింగరాయకొండ ఉన్నత పాఠశాలలో కూడా అసంపూర్తిగా గదుల నిర్మాణం నిలిచిపోయాయి.

ఈ భవనాలకు మోక్షం ఎప్పుడో ..

మార్కాపురం నియోజకవర్గంలో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కానీ అందుకు తగినట్టుగా వసతులు కల్పించడంలో మాత్రం సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా నాడు–నేడు పనులకు నిధులు ఇవ్వకపోవడంతో చాలా పాఠశాలల్లో మొండి గోడలు దర్శనమిచ్చాయి. ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియ పూర్తికాకపోవడంతో తొలిరోజు తరగతులు అరకొరగా సాగాయి.



తర్లుపాడు మండలం మీర్జపేట జెడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా తరగతి గదులు



కొనకనమిట్ల జెడ్పీ పాఠశాలలో మూలన పడిన ఆర్వో ప్లాంట్



జమ్ములపాలెం పాఠశాలలో ఆరుబయటే విద్యా బోధన..

జగన్ పర్యటన భగ్నానికి కుట్ర

- వేలాదిగా జనం తరలిరావడంతో ఓర్చుకోలేక కుట్రలు
- రాళ్లు, చెప్పులు రువ్వి కవ్వించింది టీడీపీ వాళ్లే
- దాడి చేసిన వారిని వదిలేసి వైఎస్సార్ సీపీ వారిపైనే కేసులా
- కేసులతో వైఎస్సార్ సీపీ వారిని వేధిస్తే ఊరుకోం
- టీడీపీ కుట్రలకు సంబంధించిన వీడియోల ప్రదర్శన
- కుట్రదారులను అరెస్టు చేయండి
- మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవి, కేవీ రమణారెడ్డి

ఒంగోలు సిటీ: పొగాకు రైతులకు అండగా పొదిలి పట్టణానికి వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్యక్రమానికి వేలాదిగా రైతులు, ప్రజలు, అభిమానులు తరలిరావడాన్ని ఓర్చుకోలేక ప్రభుత్వం కుట్రలకు తెరతీసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. అన్ని అనుమతులతో ప్రశాంతంగా ర్యాలీ జరుగుతుంటే తెలుగుదేశం పార్టీతో దాడులు చేయించి తిరిగి వైఎస్సార్ సీపీ వారిపైనే కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం వైపు నుంచి పొగాకు బోర్డుకు వెళితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులను కోరితే..వారు కావాలని కుటిల రాజకీయంతో దర్శి రూట్ నుంచి అనుమతి ఇచ్చారని ఆరోపించారు. పోలీసులు ఇచ్చిన రూట్ మ్యాప్‌లోనే ర్యాలీ ప్లాన్ చేకున్నామని తెలిపారు. కానీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సెక్యూరిటీ ఇవ్వాల్సింది పోయి ఆందోళన చేస్తున్న వారికి బందోబస్తు కల్పిస్తున్నట్లుగా పోలీసుల తీరు ఉందని మండిపడ్డారు. ఎలాంటి అనుమతులు లేని వారిని అక్కడకు ఎలా రానిచ్చారని పోలీసులను ప్రశ్నించారు. వేలాదిగా తరలివచ్చిన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరిగిందని ఆరోపించారు. ర్యాలీకి వచ్చిన జనాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరించారన్నారు. జడ్‌ప్లస్ కేటగిరి భద్రత కలిగిన వ్యక్తికి సరైన భద్రత కల్పించలేదన్నారు. శాంతి భద్రలకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిసికూడా పోలీసులు ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించారు. నల్లబెలూన్లలో ప్రమాదర రసాయనాలు కలిపి విసిరితే పరిస్థితి ఏంటని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ వారిని సైకోలు, గూండాలని బాధ్యత కలిగిన హోం మంత్రి పదవిలో ఉండి మాట్లాడడం తగదన్నారు. టీడీపీ నాయకులు ప్లకార్డులు పట్టుకుని, చెప్పులు, రాళ్లు విసిరారని, పోలీసులపై కూడా రాళ్లు వేశారని తెలిపారు. కానీ చేసిందంతా టీడీపీ నేతలైతే పచ్చ పత్రికలు మాత్రం వైఎస్సార్ సీపీ వారు చేశారంటూ ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. అన్ని అనుమతులు తీసుకుని ర్యాలీ చేస్తున్న సమయంలో వారిని అనుమతించక పోయి ఉంటే ఈ వివాదం తలెత్తి ఉండేది కాదని పోలీసులపై బూచేపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మా నాయకులను, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

పోలీసుల తీరు ఏకపక్షం

పోరుబాటలో అల్లర్లు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భారీ కార్యక్రమం జరుగుతున్నప్పుడు, జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన వ్యక్తి, మాజీ ముఖ్యమంత్రి వస్తున్నపుడు ఆందోళన చేస్తున్న వారిని ఎందుకు నిలువరించలేక పోయారని నిలదీశారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు, అభిమానులతో ర్యాలీ రెండు కిలోమీటర్లు ప్రశాంతంగా సాగిందని, కానీ ఆ ప్రాంతాల్లోనే ఎందుకు గొడవ జరిగిందని ప్రశ్నించారు. ముందే వారిని నిలువరించి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్నారు. జగనన్న సైనికులుగా అందరూ సంయమనం పాటించడం వల్లే విషయం పెద్దది కాలేదన్నారు. టీడీపీ నాయకులు రాళ్లు రువ్వుతున్న వీడియోలు ఉన్నాయని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మా పై బురదజల్లుతూ పబ్బం గడుపుకోవాలని చూడడం అధికార పార్టీకి సరికాదన్నారు. హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, బొట్ల రామారావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చ నేతల కుట్రతోనే అక్రమ కేసులు

● వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: పొగాకు రైతుల కష్టాలు తెలుసుకుని, మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వచ్చిన సందర్భంగా టీడీపీ నాయకులు కుట్రతోనే రాళ్లు విసిరి, తిరిగి వైఎస్సార్ సీపీ శ్రేణులపై కేసులు పెట్టారని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆరోపించారు. పోలీసులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మార్కాపురంలో మీడియాతో మాట్లాడారు. రైతు పోరుబాట కార్యక్రమంలో భాగంగా పొదిలి వచ్చిన వైఎస్ జగన్ వెంట వేలాది మంది రైతులు, అభిమానులు ర్యాలీ తీశారని చెప్పారు. మార్గమధ్యంలో టీడీపీ నేతల ప్రోద్బలంతో ఆ పార్టీ సానుభూతిపరులు నల్లబెలూన్లు ఎగురవేసేందుకు యత్నించారని, వారికి పోలీసుల అనుమతి ఉందో లేదో తెలియదన్నారు. ఈ క్రమంలోనే ర్యాలీపై చెప్పులు, రాళ్లు రువ్వి రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించారని పేర్కొన్నారు. జరిగిన ఘటనలో టీడీపీ వారిదే తప్పు ఉన్నప్పటికీ పొదిలి పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు అండగా నిలిచింది వైఎస్సార్ సీపీనే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్ని పంటలకు మద్దతు ధర లభించిందని, ఏటా సకాలంలో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందజేశామని కేపీ గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో పంటలకు మద్దతు ధర కల్పించేందుకు రూ.3 వేల కోట్లు కేటాయించి ఆదుకున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసే కార్యక్రమాలు అమలు చేయాలని హితవు పలికారు. తమ కష్టాలను చెప్పుకునేందుకు వచ్చిన రైతులు, ప్రజలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పొగాకుతోపాటు మిర్చి, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

మార్కాపురం ఆర్టీఓగా శ్రీచందన



ఆర్టీఓ శ్రీచందనతో ఎంవీఐ మాధవరావు, సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం ఆర్టీవోగా శ్రీచందన గురువారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు ఆర్టీఓగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా మార్కాపురంలో నియమితులయ్యారు. గత మార్చిలో ఆర్టీఓ అమర్‌నాయక్ పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. నూతన ఆర్టీఓను మార్కాపురం ఎంవీఐ మాధవరావు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

అశ్వవాహనంపై మదన వేణుగోపాలుడు



అశ్వవాహన సేవను ప్రారంభిస్తున్న ఈఓ, ఉభయదాతలు

పామూరు: మండల కేంద్రమైన పామూరులో మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం ముదిరాజులు, వాల్మీకులు, బెస్తవారి ఉభయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు రుక్మిణి, సత్యభామా సమేతుడై గ్రామంలో అశ్వవాహనంపై ఊరేగారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఉభయదాతలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పార్వేట ఉత్సవం వేడుకగా సాగింది. సీఐ భీమానాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

టీడీపీ నిరసనకు అనుమతి లేదట..
వైఎస్సార్ సీపీ వారిదే తప్పట!

పొదిలిలో వైఎస్ జగన్ పర్యటనలో రాళ్లు విసిరిన పచ్చ మూక ● వైఎస్సార్ సీపీ శ్రేణులు 18 మందిపై కేసులు నమోదు

పొదిలి:

వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా పొదిలి పర్యటనలో భాగంగా వేలాదిగా తరలివచ్చిన రైతులు, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించి రాళ్లు, చెప్పులతో దాడి చేసిన టీడీపీ వారిని వదిలేసి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 18 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే అక్కడ జరిగింది ఒకటి కాగా పోలీసులు చెబుతున్నది మరో విధంగా ఉందన్నది పరిశీలకుల మాట. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని అనుమతులు తీసుకుని పర్యటిస్తున్నప్పుడు.. శాంతియుతంగా మహిళలు ఆందోళన చేస్తున్నారంటూ పోలీసులు ప్రకటన చేయడం గమనార్హం.

పొదిలి పొగాకు బోర్డులో రైతులను పరామర్శించి ధైర్యం చెప్పేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సమయంలో ఆయన వెంట వేలాది మంది ర్యాలీగా కదిలొచ్చారు. ఈ క్రమంలో టీడీపీ నేతలు పక్కా పథకం ప్రకారం కొందరు మహిళలను ముందుపెట్టి పలు చోట్ల నల్ల బెలూన్లు, చెప్పులు, ప్లకార్డులను ప్రదర్శింపజేశారు. వైఎస్ జగన్ కాన్వాయ్ మండల స్థాయి టీడీపీ నాయకుడి నివాసం సమీపంలోకి రాగానే రాళ్లు, చెప్పులు విసిరారు. అందులో ఓ చెప్పు వచ్చి విధుల్లో ఉన్న డీఎస్పీపై పడింది. జరిగింది ఇలా ఉంటే వైఎస్సార్ సీపీకి చెందిన వారు దాడి చేశారని, ఆ దాడిలో పోలీసులు, మహిళలు గాయపడ్డారని పోలీసులు అభియోగాలు మోపడం పచ్చ నేతల కుట్రను స్పష్టం చేస్తోంది.



అరెస్టయిన వారికి మద్దతుగా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులు

మద్దతుగా వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్

అరెస్టయిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు మద్దతుగా ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల రామనారాయణరెడ్డి, ధర్నాసి రామారావు, జిల్లా కన్వీనర్ నగరికంటి శ్రీనివాస్, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ స్వామిరెడ్డి, బాబూరావు, శేషారెడ్డి, ఎంవీ రమణకిషోర్, భూపని కాశయ్య తదితరులు కోర్టుకు హాజరయ్యారు.

18 మందిపై కేసులు

టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులతో 18 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై రెండు కేసులు నమోదు చేశారు. పొదిలిలో గురువారం సాయంత్రం డీఎస్పీ లక్ష్మీ నారాయణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు కేసుల వివరాలు వెల్లడించారు.

కేసులు నమోదు ఇలా..

పొదిలిలోని అమ్మవారిశాల వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి టీడీపీ నాయకుడు జ్యోతి మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు పోలీసులు 8 మందిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. క్రైమ్ నెంబర్ 50–25 యూ–ఎస్ 189(2),191(2),132 ఆర్–డబ్ల్యూ 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద నెమిలిదిన్నె చెన్నారెడ్డి,(కందులాపురం, కంభం) మోరా శంకరరెడ్డి(తువ్వపాడు, కొనకనమిట్ల), పాలగిరి శరభారెడ్డి(జంగంగుంట్ల, కంభం), బిజ్జం కర్నారెడ్డి(సూరేపల్లి, కంభం) , రావూరి చిన్నరాజు(లంకోజనపల్లి, కంభం), దేవరాజుగట్టు సుబ్బరాయుడు(కందులాపురం, కంభం), మందలపు శ్రీను(తువ్వపాడు, కొనకనమిట్ల), ఏలూరి సంజీవరెడ్డి(చినారికట్ల, కొనకనమిట్ల)పై అభియోగాలు మోపారు. అలాగే బెస్తపాలెం వద్ద ఘటనకు సంబంధించి మసీదుతోటకు చెందిన ముల్లా ఖుద్దూస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసులు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 51–25 యూ–ఎస్ 189(2),191(2), 132, 121(1), 109 ఆర్–డబ్ల్యూ, 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద సాయసం రవి(బొట్లపాలెం, దర్శి), పిక్కిలి నరేష్(యడవల్లి, కనిగిరి), చొప్పరపు వీరాంజనేయులు, షేక్.ఇంతియాజ్, మందగిరి రమేష్(బెస్తపాలెం, పొదిలి), చీదా కోటేశ్వరరావు(దాసరిపల్లి, పొదిలి), యాటగిరి బాలు(సలకనూతల, పొదిలి), బొరిగొర్ల తిరుపతయ్య(వాగుమడుగు, కొనకనమిట్ల), సాదం పెద్ద వీరయ్య(వాగుమడుగు, కొనకనమిట్ల), సాదం చిన్నవీరయ్య(వాగుమడుగు, కొనకనమిట్ల)పై అభియోగాలు మోపారు.



విలేకర్ల సమావేశంలో కేసుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

నల్ల బెలూన్లు విసరడం
రెచ్చగొట్టడం కాదు

దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

మహిళల మనోభావాలు దెబ్బతిన్నాయని, వారు రోడ్డు పక్కన శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించుకున్నారని, వాటికి అనుమతులు అవసరం లేదని భావించి ఇవ్వలేదని దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ చెప్పారు. ర్యాలీలో చెప్పులు, రాళ్లు, వాటర్‌బాటిళ్లు విసురుతున్న సీసీ ఫుటేజ్ దృశ్యాలను విలేకర్ల ముందు ప్రదర్శిస్తుండగా మహిళల వైపు నుంచి రాళ్లు, చెప్పులు విసిరారు కదా అని ఓ విలేకరి ప్రశ్నించగా, ర్యాలీలోని అల్లరిమూకలు విసిరిన చెప్పులనే, తిరిగి మహిళలు ర్యాలీపై విసిరారని డీఎస్పీ సమాధానమిచ్చారు. మహిళలు నల్ల బెలూన్లు ర్యాలీపైకి విసిరినట్లుగా స్పష్టంగా కనిపిస్తోంది, అలా చేయడం రెచ్చగొట్టడం కాదా అని విలేకరి ప్రశ్నించగా.. బెలూన్లు విసిరితే నష్టం ఏమి జరగదని సమాధానం చెప్పారు. గతంలో కూడా ఫ్లెక్సీల్లో రెచ్చగొట్టే విధంగా రాతలు ఉన్నాయని, అప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు డీఎస్పీ స్పందిస్తూ.. వాటితో పనేమి లేదని, ప్రస్తుత సంఘటనపై మాత్రమే స్పందిస్తున్నామన్నారు. ఇంటెలిజెన్స్, నిఘా వైఫల్యంపై పరిశీలన చేస్తున్నామని విలేకరుల ప్రశ్నకు జవాబిచ్చారు. ఇదిలా ఉంగా పోలీసులు విలేకర్ల సమావేశంలో ప్రదర్శించిన చెప్పులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వాటిలో చాలా వరకు జనాలు తొక్కిడిలో పోగొట్టుకున్న వాటిగానే భావిస్తున్నారు. పోలీసులు ప్రదర్శించిన రాయి ఎవరికైనా తగిలిందో లేదో స్పష్టం చేయలేదు.

9 మంది అరెస్టు

సీసీ ఫుటేజీల ఆధారంగా 9 మందిని అరెస్ట్ చేసి, దర్శి కోర్టులో హాజరుపరిచినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. అరెస్టయిన వారిలో శాగం రవీంద్రారెడ్డి,(బొట్లపాలెం, దర్శి), మోరా శంకరరెడ్డి(తువ్వపాడు, కొనకనమిట్ల), చొప్పరపు వీరాంజనేయులు(ఎడవల్లి, కనిగిరి), బిజ్జం వెంకట సుబ్బారెడ్డి(సూరేపల్లి, కంభం), రావూరి చిన వెంకట రాజులు(లింగోజిపల్లి, కంభం), చీదా కోటేశ్వరరావు (దాసరిపల్లి, పొదిలి), యాటగిరి బాల చెన్నయ్య(దొండ్లేరు, పొదిలి), దేవరాజుగట్టు సుబ్బరాయుడు(కందులాపురం, కంభం), షేక్. ఇంతియాజ్(నవాబ్‌మిట్ల, పొదిలి) ఉన్నారని ఏఎస్పీ వెల్లడించారు.

వేలం బహిష్కరణ..
రోడ్డెక్కి నిరసన

పొగాకు రైతులు కన్నెర్ర చేశారు. పండించిన పంటను కొనుగోలు చేయడం లేదు.. కంపెనీల ప్రతినిధులు, అధికారులు, దళారులతో కుమ్మక్కై రైతుకు కనీసం మద్దతు ధర ఇవ్వడం లేదు. నాలుగు బేళ్లు తెస్తే.. ఒక్క బేల్ మాత్రమే తీసుకుని మిగిలినవి నో బిడ్ పేరుతో తిరస్కరిస్తున్నారు. ఎన్నిసార్లు బోర్డుకు వచ్చినా ఇదే పరిస్థితి. పొగాకు సాగుకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం. వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం. ఏటా ఈ సమయానికి 80 శాతం పొగాకు బేళ్లు అమ్ముడయ్యేవి. ఈ ఏడాది కనీసం 30 శాతం కూడా కొనలేదు. బయ్యర్లు అన్ని రకాల బేళ్లను కొనుగోలు చేసే విధంగా బోర్డు అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పొగాకు రైతులకు న్యాయం చేయాలి.

ఇదీ కనిగిరిలో పొగాకు రైతుల డిమాండ్

- ● కనిగిరి–పొదిలి జాతీయ రహదారిపై బైఠాయించి పొగాకు రైతుల రాస్తారోకో
- ● గిట్టు బాటు ధర కల్పించి, అన్ని రకాల పొగాకు బేళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్
- ● హైవేపై గంటకు పైగా స్తంభించిన వాహనాల రాకపోకలు
- ● రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేసిన పోలీసులు
- ● తమకు అన్యాయం చేస్తున్నారంటూ బోర్డు అధికారులపై రైతుల మండిపాటు
- ● అన్ని రకాల బేళ్ల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్న ఆక్షన్ సూపరింటెండెంట్



మద్దతు ధర కోసం కనిగిరిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న పొగాకు రైతులు

కనిగిరిరూరల్: పొగాకుకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం కనిగిరిలో వేలాన్ని బహిష్కరించిన రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. పొగాకు రైతులను పట్టించుకోని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన తెలిపారు. చాకిరాల క్లస్టర్(చాకిరాల, వెలిగండ్ల, రామలింగాపురం, రామాపురం, గోకులం, జిల్లెలపాడు, కేకే పల్లి, మల్లంరాజుపల్లి, సూరావారిపల్లి) పరిధిలోని 9 గ్రామాలకు చెందిన సుమారు 150 బ్యార్నీలకు చెందిన 200 మంది రైతులు గురువారం 605 బేళ్లను వేలానికి తెచ్చారు. ప్రతి రైతు కనీసం 3 నుంచి 4 బేళ్లు తీసుకురాగా.. వాటిలో ఒకటీ రెండు మాత్రమే కొనుగోలు చేసి, మిగతా వాటిని నోబిడ్ పేరుతో తిరస్కరించారు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశానికి లోనయ్యారు. వేలంలో పాల్గొన్న 9 కంపెనీల ప్రతినిధులంతా కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని.. నో బిడ్ పేరుతో తిరస్కరించడం సరికాదంటూ రాస్తారోకో చేశారు. దీంతో కనిగిరి– పొదిలి జాతీయ రహదారిపై సుమారు గంటకుపైగా వాహనాలు స్తంభించాయి. ఎస్సై టి.శ్రీరాం తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్య ఉంటే బోర్డు లోపల అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని, రోడ్డెక్కి వాహనాలు ఆపడం చట్టరీత్యా నేరమని చెప్పారు. దీంతో రైతులు తమ గోడును పోలీసుల ఎదుట వెళ్లబోసుకున్నారు. తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలయ్యామని.. తమ కష్టాలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని, దిక్కుతోచని స్థితిలోనే న్యాయం చేయాలని రోడ్డెక్కామని వివరించారు. చివరకు పోలీసులు సర్దిచెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

ఆక్షన్ సూపరింటెండెంట్‌పై రైతుల ఆగ్రహం

రాస్తారోకో వద్దకు వచ్చిన బోర్డు సూపరింటెండెంట్ ఆంజనేయులుపై పొగాకు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీల ప్రతినిధులు, బయ్యర్లు అంతా కుమ్మక్కై బేళ్లను తిరస్కరిస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. బోర్డు అధికారులు చెప్పిన ప్రకారమే పొగాకు సాగు చేశామని.. ఇప్పుడు డిమాండ్ లేదంటూ బేళ్లను తిరస్కరిస్తే తమ గతేం కావాలని ప్రశ్నించారు. ఇతర బోర్డుల కంటే కనిగిరిలోనే తక్కువగా కొనుగోళ్లు జరుగుతున్నాయని.. అక్కడ కొనుగోళ్లు చేస్తున్న కంపెనీలు ఇక్కడ ఎందుకు తిరస్కరిస్తున్నారని నిలదీశారు. నో బిడ్ లేకుండా లోగ్రేడ్ పొగాకు బేళ్లను కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి అన్ని రకాల బేళ్ల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని బోర్డు సూపరింటెండెంట్ చెప్పడంతో తిరిగి వేలం కొనసాగింది.

రైతులు ఇబ్బంది పడుతోంది వాస్తవం

లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఆందోళన చేశారు. 9 కంపెనీలు లిస్ట్‌లో ఉన్నా 4 కంపెనీలే పూర్తిగా వేలంలో పాల్గొంటున్నాయి. ఒక్క కంపెనీ(పొలిశెట్టి) మాత్రమే లోగ్రేడ్ కొనుగోలు చేస్తోంది. అందులో కూడా పతలా రకం మాత్రమే తీసుకుంటున్నారు. మిగతా కంపెనీలు తమకు ఆర్డర్ లేదని కొనుగోలుకు ఇష్టపడటం లేదు. అందువల్ల రైతులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. రైతులు ఆరోపించినట్లు కుమ్మక్కు ఏమీలేదు.

– ఆంజనేయులు, వేలం నిర్వహణాధికారి

30 ఏళ్లలో ఇలాంటి దుస్థితి చూడలేదు



నేను 30 ఏళ్ల నుంచి పొగాకును సాగు చేస్తున్నా.. ఇలాంటి దుర్భర పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం పొదిలి బోర్డుకు వస్తున్నారని తెలిసి, కనిగిరి బోర్డులో కంపెనీ ప్రతినిధులు లో గ్రేడ్ బేళ్లు బాగానే కొనుగోలు చేశారు. రేటు కూడా బాగా వేశారు. కానీ గురువారం పరిస్థితి యథామామూలే. గతేడాది పొగాకు కేజీ రూ.360కు కొనుగోలు చేశారు. ఇప్పుడేమో సరాసరి ధర రూ.250 ఇస్తున్నారు. కంపెనీలన్నీ సిండికేటై రైతులకు అన్యాయం చేస్తున్నాయి. ప్రస్తుతం 7 రౌండ్ వేలం జరుగుతోంది. ప్రతి రౌండ్‌లో 300 బేళ్ల వరకు తిరస్కరించారు. గిట్టుబాటు ధర కల్పించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

– ఆంజనేయులు, వెలిగండ్ల, పొగాకు రైతు

రైతులను ముంచుతున్నారు



నేను పది ఎకరాల్లో పొగాకు సాగు చేశా. గతేడాది కేజీ రూ.360 వరకు పలికింది. ఇప్పుడు కేజీకి రూ.230 కూడా ఇవ్వడం లేదు. కంపెనీ ప్రతినిధులు, కుమ్మక్కై కేవలం ఎఫ్1,2,3 రకం మాత్రమే కొనుగోల చేస్తున్నారు. లోగ్రేడ్ అసలు కొనడం లేదు. గత ఏడాది పెట్టుబడి ఎకరాకు రూ.70 వేలు అయితే ఈ ఏడాది రూ.1.30 లక్షలు పెట్టాం. నా వద్ద 60 బేళ్లు ఉన్నాయి. ఇప్పటికి ఏడుసార్లు వేలానికి తేస్తే కేవలం 14 బేళ్లు మాత్రమే కొన్నారు. సీజన్ అయిపోతుంది. గిట్టుబాటు ధర లేదు. అప్పుల వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

– కల్లు రాఘవరెడ్డి, చాకిరాల, రైతు

గట్టిగా ప్రశ్నిస్తే డిమాండ్ లేదంటున్నారు



కనిగిరి టుబాకో బోర్డులో కంపెనీ ప్రతినిధులు, అధికారులు, దళారులు కుమ్మక్కయ్యారు. వారికి నచ్చిన వారికి, డబ్బులు ఇచ్చే వారికి మాత్రమే మంచి ధర ఇస్తున్నారు. పొదిలి, కందుకూరు, ఇతర కేంద్రాల్లో ఇచ్చిన ధర ఇక్కడ ఎందుకు ఇవ్వడం లేదు. కనీస మద్దతు ధర ఇవ్వకుండా, లోగ్రేడ్‌కు పొగాకును తీసుకోకుండా నో బిడ్ అంటున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే డిమాండ్ లేదని చెబుతన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఏమయ్యాయి.

– శివారెడ్డి, చాకిరాల, రైతు

కూటమి ప్రభుత్వంలో అందరికీ కష్టాలే

- ● ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయిలు రాక విద్యార్థులకు ఇక్కట్లు
- ● ప్రభుత్వ తీరును నిరసిస్తూ నేడు అంబేడ్కర్ భవన్ వరకు కలెక్టరేట్ వరకు ర్యాలీ



మాట్లాడుతున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఇతర నేతలు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు చెందిన వారిని కూటమి ప్రభుత్వం తీవ్ర మనోవేదనకు గురి చేస్తోందని మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే విద్యార్థులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఉండేది కాదన్నారు. కూటమి ప్రభుత్వం డబ్బులు వేసివుంటే విద్యార్థులకు కళాశాలలు టీసీలు ఇచ్చేవారు కాదన్నారు. పార్టీ ఆదేశానుసారం విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు రెడ్‌బుక్ రాజ్యాంగంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల సమస్యలపై లేవన్నారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రస్తుత కార్పొరేట్ స్కూల్స్‌లో అధిక ఫీజులతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్య వ్యవస్థను ఎంతో అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే నిర్వీర్యం చేసేందని ధ్వజమెత్తారు. యూత్ జాయింట్ సెక్రటరీ మున్నంగి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. ఒంగోలు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దేవ, ఒంగోలు నియోజకవర్గ స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు వి.శ్రీకాంత్, ఒంగోలు సిటీ ప్రెసిడెంట్ సయ్యద్‌ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.